



# కార్చిచ్చు

కవికొండల వెంకటరావు

ఊరిక్కొనవచ్చే ఉత్తరదిక్కుండలాన్నే కొండ వుంది. కొండమీదా కొండపంఘా అడివి. ఆ అడివిలోకి బళ్లు కట్టుకువెళ్లి, పెద్దపెద్ద పోటు కత్తుల్తో గొడ్డళ్లతో తెగనరికి బళ్లకెక్కించి వెదురూ, కంపా, వాసం, కలపా, పుల్లా, పుడుకా, యిళ్లకు తెచ్చుకోవడమనే వేసంగి చర్యపేరు "అడివిపాలం వెళ్లిరావడ"మంటారు.

అడివిపాలానికి పయనమౌతున్నారూ అంటే అదో కలకలం కలవరం ఊరంతా పొసిగించన్నమాటే. వెళ్లేవాళ్లకు వెళ్లనివాళ్లంతా తిరగటి కురుజాలుకు పనికివచ్చే తునకనుంచి గానుగుకోకలి కమిరే తుండుదాకా నాకు తెచ్చిపెట్టు నాకు తెచ్చిపెట్టు అని పురమాయించేవారే. బయలు దేరి పొయ్యేవాడికి ఎలావుంటుందీ-యుద్ధానికి సన్నద్ధుడై వెడుతూన్నట్టుట్టుంది, పెద్దపులి నోట్లో పడకుండా. పాముకాటు తినకుండా, చెట్టుపైని కూలకుండా, ముల్లు కాల్లో విరక్కుండా, సురక్షితంగా, ఎలా వెళ్లినవాడు అలా రావడమనేది గొప్పమాట.

గుడిసె, గుడిసెముందు గడ్డివెన్నెల, గడ్డివెన్నెల్లో కుంచం కైవారాని కొచ్చిన నల్లతుమ్మచెట్టు నీడజాడ, నీడజాడనే ఆసాయంకాలం నారేసినబండి, బండితొట్టి ఆచాయల అప్పుడే ఉలవలూచిట్టూ తిన్న కొత్త గిత్తలు, కొత్తగిత్తల మెడల్లో గంటలు కదుతూవున్న బండి ఆసామీ రుద్రయ్యా! రుద్రయ్యతో "ముంత ఇదిగో! ఆనపకాయబుర్రా మంచినీళ్లూ ఇవిగో!" అని అందిస్తూ నిలబడివున్న మాలచ్చుమమ్మ మాట:—ఆమాలచ్చుమమ్మమాట ఎక్కడమాఱుమోసిందీ? రెండేదిక్కుల మాఱుమోసింది. రుద్రయ్య చెవిలోను, తిన్నగాచూస్తే కార్చిచ్చున మండిపోతూ సెగ్గాడుపులు వాళ్ల గుడిసె కంటూ కొడుతూన్నట్టు దోపింపచేసే కొండకోనలోను మాఱుమోసింది.

మాలచ్చుమమ్మ కావులించుకుంది రుద్రయ్యమెడను-రుద్రయ్య బండికట్టుకు "తోడిబళ్ళు ముందుపోతున్నాయి పోవాలి పోవాలి" అంటూవుంటే. ఆకావులింపులో రుద్రయ్యబోరకు మాలచ్చుమమ్మబోర హత్తుకుపోయి స్పర్శసుఖం అపురూపంగా గొలిపింది. ఎంచేతో తెలుసునా? వాని ముతకకండువా తలకు చుట్టుకున్నాడు. వానికున్న తుండుగుడ్డ చిన్నది మొలనే ఎగ్గట్టుకున్న పంచిమీదనే చుట్టపెట్టుకున్నాగు. వాని వక్షస్థలం అతినగ్నంగావుంది. ఇఖ మాలచ్చుమమ్మ విషయం ఆలోచించడంవస్తే దానిమెళ్లో తాళితాడుకూడా అడ్డులేదు. వాళ్ళు- ఆతెగవాళ్లల్లో ఆడవాళు రయికే తొడుగరు. కోకకట్టుకు కొంగు చాటేసుకున్నా ఆని మిషమప్పుడు ఆకౌగిలింతలో జారిపోయింది చటాల్న మాలచ్చుమమ్మ ఉరోజాలయొక్క ఉన్నతమైనటువంటిన్నీ, ఉన్ముఖములైనటువంటిన్నీ మొనలనుండి ఆలా ఆలా ఓపెడకు నేలకు.

"ప్రతీయేడూ వెళ్ళి రావడం లేదుటే?" అన్నాడు రుద్రయ్య. "ప్రతీయేడులాగూ లేవు గాదుపు లీయేడు. ఏయేడన్నా ఇల్లా నిప్పు లేకుండా అంటుకుపోయినాయి పూళ్ళు? చూడ చూడు పోతుకొండనే ఎరగలి. అక్కడంటుకుని అడివి తెగ్గాలుతూవుంటే మన ముంగటున్న తుమ్మచెట్టంటుకున్నట్టుగా వుంది. అయినా పయనించుకూకున్నాక నేనుసేసేదేముందికనుక వెళ్ళి రా! వెళ్ళి రా!" అంది మాలచ్చుమమ్మ. రుద్రయ్యకు మీసాలున్నాయి. ఆమీసాలోమాటు మాలచ్చుమమ్మ చెక్కిళ్ళనే రాస్తూ "వెళ్ళొస్తా! జాగర్త! ఎల్లకాలం కార్చిచ్చులకు జడిస్తే మృగశిర బిందించివూరుకుంటుంది. కదలడమెలా ఇగ" అన్నాడు. అంటూ బండినొగుచ్చుకు తొట్లోకెక్కి "హు" అన్నాడు గిత్తల్ని. మాలచ్చుమమ్మ ఎవరో అలావెడుతూన్నట్టయితే "ఒలేవు మీయాధి వెంకన్న వెడుతున్నాడా అడివిపాలెం?" అంటూ "ఆ" అన్న అవతలగొంతుదిక్కుగా మనసుకుదుటుపఱుచుకుంది. కాని అడుగు?

మళ్లీ మనం మాలచ్చుమమ్మ నాగుడిసెముందు చూచీది మర్నాటిసాయంకాలం కొండమీద కార్చిచ్చులు ఎర్రగానెలిగిపోతూ కనవచ్చే మునిమాపువేళే. కార్చిచ్చుకేసి చూస్తూవుంది ముంగిటకూర్చుని. ఆక్రితం పొద్దు రుద్రయ్య అడవిపాలెంవెళ్లినతరువాతను వెంటనే కనిపించిన మనిషే మళ్లాతోడయి పలుకరిస్తూవుండా మాలచ్చుమమ్మ నాఘడియ కన్నట్టు "మాలచ్చుమమ్మా!" అనిపిలిచింది. మాలచ్చుమమ్మ "రాతి రింక గుడిసెలో నిదరట్టేదేంటని నెలకునక్కుండానే పొలమీమ్మదకుపోయి గాలితెరపిని తొంగుడుండాను" అంది. "నీ దెల్లాగన్నా ఇచ్ఛారాజ్యం మాలచ్చుమమ్మా!" అంది అవతలమనిషి. "ఏం?" అంది మాలచ్చుమమ్మ. "ఏముంది! మాకందరికీ మెళ్లల్లో పలుపుతాళ్ళలాగు తాళితాళ్లుంటే నీమెళ్లోలేదుగదా అలాంటిది! నీదికాకపోతే మాదాస్వేచ్ఛ?" అంది అది. "ఏంటో, అలా అనుకుంటారుగాని మీరంతా! నీమగడు నీకెంతో నాకు రుద్రయ్యఅంతే. వాడడవిపాలెంవెళ్ళిపొయ్యేటప్పుడు చూచావుకాదు మమ్మల్నిద్దర్ని- ఇడిసిపెట్టలేక పోయినాను. మాయముండా పాణం- ఓమాటు గుడిసెలో కొచ్చి ఓనిదరోయి మళిపోరాదంట్రా అని అనాలని అనిపించింది. ముండాఎద!" "పోనీ వెళ్ళలేకపోయావు ఆడెనకాలే అడివిపాలెం?" "అలాఅనుకునే కొంతదూరం అటేవెళ్ళి మళ్లీయేంతోచిందో అక్కడే దార్లోనేగా మాపాలెం - ఆపాలంగట్టునే తొంగుడుండి పోయేను, గంటలచప్పుడు దూరదూరమైన కొద్దీ తొంగలిరెప్పలు మూతలేసుకుంటూ. తెల్లారి ఎప్పుడులేచాననుకున్నావు? పొద్దు నెత్తిమీదికెక్కింది. ఇఖప్పు డూళ్ళోకొచ్చిదేంటని అక్కడే నూతిలోనీళ్ళు త్రాగి నువ్వుముక్కలకు గొప్పుతవ్వి అలసిఅలసి యిప్పుడింటికొచ్చి గంజికాచుకుందామని పోయిరాజేశాను." అంది మాలచ్చుమమ్మ. "నీచర్య ఊళ్లోవాళ్లెవళ్ళూ హర్షించడం లేదే!" అంది అవతలి ఆడుమనిషి. ఆఆడమనిషి కొంచెం ముదురుమొగంమనిషిలా గగపిస్తుంది. కనీపెంచీది కావచ్చు. నడుంకూడా దాన్ని పురస్కరించుకునే ముడతలుపడివున్నట్లు అగపిస్తుంది. ఏమాత్రం జవజవలేదు. అయినప్పటికీ ఏలాగన్నా ఆడమనిషికాబట్టినీ అంతగా వయస్సుమళ్లిపోయింది కాదుకాబట్టినీ తోసెయ్యడానికి వీల్లేనిమనిషే. అందులోకీ నీతులు కఱపడంవంటూవస్తే వీధివీధి వాడవాడ ఆమెగొంతుక ఖంగుమన్నాదన్నమాటే.

"హర్షించడం లేదే!" అని అనేసరికిమాలచ్చుమమ్మ "ఏమమ్మా?" అంది. నీవు రుద్రయ్యతో ఎక్కడపడితే అక్కడే మాట్లాడుతావటగా! నీవు రుద్రయ్యతో ఎప్పుడుపడితే అప్పుడే సయ్యాట్లాడతావుటగా! ఉంచుకున్నవాళ్ళను చాలామందిని చూశానుగాని నేను అంతబహిరంగముటే? కుఱ్ఱనా!" అంది పెద్దమనిషి.

"నీ వన్నమాటే నిజమైతే ఆడితో అడివిపాలెం పోలేకపోయేనూ? ఆమాత్రం యోజించుకోలేవు అన్నెళ్లొచ్చి నీవు?" అని మురలకించింది మాలచ్చుమమ్మ.

ఆలా మాలచ్చుమమ్మ అంటూవుండగానే ఊళ్లో ఓమూల పెద్దగోలగా బయలుదేటి ఆగోలలోనుంచి పెద్దపెద్ద ఏడుపులూ, పెడబొబ్బలూ ప్రారంభించాయి! "ఓరి నాయన! నాయన! నా నాయనా!" అంటూ ఓ ముసిలి

ముండ ఏడుస్తూ ఱొమ్ములు బాదుకుంటూ తనకొడుకు చచ్చిపోయినాడా చచ్చిపోయినాడా? ఎక్కడ?అడివిలో" అంటూ కొయ్యబారిపోయింది మాలచ్చుమమ్మ గుడిసెముంగట తుమ్మకాడ.

మాలచ్చుమమ్మ యిక తాను మంచిమాట చేసుకోవడమనేది మఱచిపోయి గభాల్న లేచి "అడివిపాలం వెళ్లినోళ్లు తిరిగి వచ్చినారా. నీకొడుకూసు ఎవరు చెప్పినారు వెంకమ్మవ్వా!" అంటూ తుమ్మచెట్టుకేసి వెళ్లింది. జనం చుట్టేశారు పదిమందీని అప్పటికప్పుడే.

జనం చుట్టేసినకొద్దీ ముసిలమ్మఏడుపురాగం మరీ దీర్ఘమె "అడివిపాలం మింగేసిందల్లో నాబంగారుకొండని" అని కడుపులు తఱిగి చేస్తాంది. మాలచ్చుమమ్మ అక్కడున్న ఓ మనిషితో ఆముసిల్దానికి వినబడేటట్టుగానే "ఈ అవ్వకొడకూ, నారుద్రయ్య కలిసే వెళ్లారుగా నిన్నరేత్రి అడివిపాలం" అంది. ముసలమ్మ వెంటనే "అవునే నా తల్లీ! మాలచ్చుమమ్మా! వెళ్లేరే! నీరుద్రయ్యా, నాకొడుకూ అన్నమాటేమే యింకా ముగ్గురు కలిసి వెళ్లిపోయినారే! అందర్నీ మింగివేసిందంటే మాయదారి అడవిపాలం, అందర్నీ మింగేసిందంటే మాయదారిఅడవిపాలం." అని గావుకేకేసింది. మాలచ్చుమమ్మ వెనక్కు విఱిగబడి, అప్పటికప్పుడే లోపలదుఃఖం పూరటిల్లి పొంగి గద్గదింపొచ్చినట్లు ఎలుగురాసి "నారుద్ర! నారుద్ర!"" అంటూ సొమ్మసిల్లిపోయింది. మూగినజనంగుంపులో సగం మాలచ్చుమమ్మకేసివచ్చి ఓదార్చబోతున్నారు. నిదానించమంటూ వున్నారు. కొందఱు "దాన్ని చూసేదేంట్రా! ఈయేల రుద్రయ్యపోతే రేపుభద్రయ్య-దాన్ని చూసేదేంట్రా!" అంటూ ముసిలమ్మను ఊరుకో పెట్టడంలో తమ చాకచక్యం అంతా చూపిస్తున్నారు. ఏలాగైతేం ముసిలమ్మను తీసుకొని అంతా వెళ్లిపోయారు.

రాత్రిరెండుజాములు, అయింది అప్పటికప్పుడే. రుద్రయ్యమొదలైనవాళ్లందఱూ ఆ అడివిపాలంలో అజాపజాలేకుండాఎలాచనిపోయినారో ఆవృత్తాంతం అంతా ఒకస్వప్నవృత్తాంతంగామాఱిపోయింది. ఊరంతా మాటుమణిగిపోయింది- మాలచ్చుమమ్మకన్నీళ్లతెఱపి చుక్కల్లో కనవచ్చింది పోతుకొండమీదికార్చిచ్చు పేద్దపగడాలగుండులాగు. "చచ్చిపోయావా?రుద్రయ్యా! చచ్చిపోయావా? కార్చిచ్చులకుజడిస్తేమృగశిరబిందించి వూరుకుంటుందన్నవాడివి. ఎందుకూజడియనివాడవు, నలుగురితోవెళ్లి వడకొట్టి చచ్చిపోయావా? రుద్రయ్యా!" అంది. వడగొట్టడానికి ఆనపకాయబుఱ్ఱలోని నీళ్లన్నీ అయిపోయినాయా? నారుద్రయ్యా!" అనిఅనుకొంది. చివాల్న లేచింది. "రుద్రయ్యా! నీయెముకలన్నా కనిపించకపోతయి నేనిప్పుడలా అడివిపాలం వస్తే?" అనిప్రయాణమౌతూంది.

గణగణా గణగణా దూరాన్నుంచి వట్టి రెండెడ్లబండెగరేసుకుంటూ చేలగట్లనక, చెలకలకంచెలనక, ఉడాములమీద రుద్రయ్యయొక్క గిత్తలువచ్చి తనగుడిసెముందు వ్రాలినట్టుగా ఆగినయి. మాలచ్చుమమ్మ బండివిప్పింది. గిత్తల్ని కావులించుకుదువ్వి, విప్పినబండియొక్క తొట్టికట్టిపెట్టి, బండిలో ఏమున్నది చూచింది. బండిలో ఏముంది? బండిలో ఏమీలేదు. ఆనపకాయ బుఱ్ఱగాని, అన్నంమూట గాని లేదు. ఎవడో బండీఎడ్లనూ దొంగచాటుగా అడివిపాలంలోంచి తోలుకు పోబోతే వాడు తీసిన దారిని బోకయెగరేసుకు బండిని అమాంతంగా తీసుకొనివచ్చి తనగుడిసెముంగట నిలిపినట్లుగా తేల్చుకుంది మాలచ్చుమమ్మ. "ఇలాంటి గిత్తలను తోలే నారుద్రయ్య చచ్చిపోతాడా? ఈగిత్తలుండగా" అని ఆసాసచూచింది మాలచ్చుమమ్మ. వెంటనే అడివిపాలంపోయి రుద్రయ్యయెముకలన్నాచూచి ఉపశాంతి పొందుదాం అని అనుకొన్నమనిషి గిత్తల్నేం చెయ్యనా అనే ఆలోచనలో బడింది. బండి నేం చెయ్యనా అనే బాబాంకరంలో బడింది. ఆబండీయెడ్లను పూన్చుకొని వాటితోకూడా ఎందుకు అడివిపాలం పోకూడదు వెంటనే అని అనుకుంది. చూచింది ఉత్తరదిక్కుగా పగ్గాలుతొట్టెనుండి సళ్లిస్తూ. కార్చిచ్చు మండుతూంది యింకా-తూర్పువేపు వేగుచుక్కొడుస్తూవున్నా. "కార్చిచ్చులో మండిపోయి రుద్రయ్య నుసికాకుండా వుంటాడా ఈపాటికి.

అయ్యో! రుద్రయ్యా!" అని కుమిలికుమిలి కూర్చుని పోయింది.


ఎడ్లూ బండీవచ్చినజాడనే ఆగడియకు ఎవరో మనిషి దూరాన్నే చుక్కవెలుగులో తెల్లనిపంచి కప్పుకుని వస్తూవున్నట్టయింది. "ఎవరువారు?" అంది మాలచ్చుమమ్మ. "నేనే" అన్నాడు రుద్రయ్య. "నారుద్రయ్యా! నారుద్రయ్యా!"అని ఎగూపిర్ని గట్టిగా కౌగలించుకుంది, రుద్రయ్య ఏంమాట్లాడుతాడు? దానిసరియితే జిగిబిగిపరిరంభణంలో నొవ్వ జిక్కుకొని ఏంమాటాడుతాడు? "బతికున్నావా?"అంది తానే దిగూపిర్ని సళ్ళిచ్చి. "ఏం చచ్చిపోయానని ఎవరుచెప్పారు?"అన్నాడు రుద్రయ్య. "ఊరంతా పొక్కిపోతేనే మాయమాట! నీకు వెయ్యేళ్ళుఆయుస్సువుంది రుద్రయ్యా!" అంది మాలచ్చుమమ్మ. "ఎక్కడికో పయాణమౌతూవున్నట్టున్నావు?" అన్నాడురుద్రయ్య. "నీకోసమే, అడివిపాలెం. నీవు పోయేవనడంతోనే నీఎముకలన్నా నెలికి ఈబండిమీదేసుకొచ్చి యిక్కడ దహనపఱచి అందులోపడి మృతవారి పోవాలని సంకల్పించుకున్నా." నంది మాలచ్చుమమ్మ. రుద్రయ్యఅన్నాడు "నిజంగా సచ్చుంటే అడివిపాలెంలో ఎముకలూగిముకలూ మిగులుస్తాయి కోతులూ, ఎలుగ్గొడ్లూను? చెట్లెక్కి చిఱతల్లా వాయించుకుంటూ కార్చిచ్చులో ఈపాటికే పారేసివుండును" అన్నాడు రుద్రయ్య. అలాంటి పరిస్థితిలో ప్రేమ ఎలా చూపించడం అనే ఆలోచనలోపడ్డట్టూరుకుంది మాలచ్చుమమ్మ.

ఈ వీళ్లు అనుకొన్న కబుర్లమీద గాలికూనలు తెల్లారకుండానే ఊరంతా కమ్ముకు పోయినయి. "రుద్రయ్య చావ శేదంట్రా! రుద్రయ్య ఇంటికేవచ్చేట్ట" అని అనుకుంటూ ఊరంతా తుమ్మచెట్టుకిందకు మూగారు. రాత్రల్లాఏడ్చిన ముసలమ్మ "నాకొడుకుసంగతి ఏంటిబాబా? రుద్రయ్యా! ఆడురాలేదేం ఇంటికి?"అని అడుక్కతూచేరింది ఆస్థలానికి. ఎవళ్లూ ముఖాలన్నా కడుక్కోలేదు. రుద్రయ్యకూర్చుని మీసాలుదువ్వుకొంటూ సెప్పేడు.


"మట్టమధ్యాహ్నం రెండుజాములయ్యేసరికి నిన్నటి పొద్దుపోతూకొండెక్కమోతున్నాం—కొండమీద కార్చిచ్చులు ఎండకాంతితో ఏకమై నకమొకాలవేడితప్ప మఱొటిఏం లేకపోయింది. కాకికూడా కావుఅనడం మానేసింది. అకార్చిచ్చుతప్పించుక అవతలపడి చలికొండఎక్కితేనేగాని కొట్టడానికనువైనఅడివిమ ఎక్కడాకానరాలేదు. ఏలాగురా దేముడా! వండుకున్న కూళ్లు, నీళ్ళబుర్రలు గొడ్డళ్లతోను, పోటకత్తులతోను అవలకు తీసుకుపోవడం సాధ్యంకాదనుకోనికూటిముంతలు, నీటిబుర్రలు యీతలేదిగువచను చింతచెట్లకు వ్రేలాడగట్టి బళ్ళనూ, ఎడ్లనూ అక్కడేవుంచి, గొడ్డళ్లూపోటకత్తులూ బుజాల్నేసుకుని దారితెన్నులు తెలుక్కుంటూ పోబోయేము. ఎటుచూచినా దవానలమే. బాబుల్లారా అమ్మల్లాం! ఎటుచూచినా దవానలమే. చలికొండకు తోవే కానకపోయాం. పొద్దలావాలేదాకా తోవకోసం నెమకలాడుతూనేవున్నాం. కానకపోయాం. మేంవెళ్లిన నలుగురైదుగురుం మళ్లుమొగాలట్టి యిళ్ళకు పోతే మేలుగు అనుకున్నాం. అనుకొని మళ్లు మొగాలట్టాం. మళ్లు మొగలట్టి బళ్లున్నకాడకు వచ్చేతలికి మానాలుకలు తడారిపోయి, మానోళ్లు పిడపకట్టుకుపోయి, నీళ్లెక్కడర్రా! కూళ్లమాట దేవుడెఱుగు అన్నట్టుగా ఉండిపోయినా.

చింతచెట్లకేసి చూచుకుంటే, కోతులు కూళ్లమూటలు విప్పుకొని కూళ్లుతినేసి గుడ్డపేలికలుకిందపారేశిన్నీ ఆనపకాయబుర్రల్లో నీళ్లుతాగేసేసిబుర్రలుక్రిందకు గిరాటేశి చితకకొట్టిన్నీ మానోళ్లల్లో కరకాయగొట్టి మమ్మల్ని వేధించి పారేశాయి. నాతో వచ్చిన నలుగురూ హారీమని వడగొట్టి ప్రాణాలొదలేశారు. నేనూ చచ్చిపోయినాను." అన్నాడు.

ముసిలమ్మ యేడుపు ప్రారంభించింది అంతలోకే, "ముండాకోతులు నీకెక్కడదాపరించినాయిరా కొడకా!" అంటూ. మాలచ్చుమమ్మ "నేనూ చచ్చిపోయినాను అంటున్నాడు." రుద్రయ్యా? కాక రుద్రయ్య దయ్యమా?" అని మిఱ్ఱుమిఱ్ఱు చూడసాగింది. వినేజనం గుంపు "సెప్పు సాంతంగా కథ సెప్పు" అంటున్నారేకాని చెప్పే కథలోని అవకతవకయొక్క ఆకలింపు



" ముంత ఇదిగో ఆనపకాయబుర్రా మంచినీళ్లు ఇదిగో."




" రుద్రయ్య కూచుని మీసాలు దువ్వుకొంటూ చెప్పేడు."

లేదు వాళ్లకు. రుద్రయ్య మాయమైపోయినాడు. అంతా చూస్తూ వుండగానే మాలచ్చుమమ్మ గొల్లుమంది, "ఆరి నా రుద్రయ్యా, నాగొంతుక నొక్కేసి నన్ను చంపేస్తున్నాడు" అంటూ.

"కార్చిచ్చుకేసి చూడకు మాలచ్చుమమ్మా! అడివిపొలంమాట తలపెట్టకు మాలచ్చుమమ్మా!" అని ఓదార్చేరు కొందరు. కొందరు బెదరుడిపేరు. "కార్చిచ్చుతలపెట్టకపోతే మఱిదేన్ని తలపెట్టనల్లో అడివిపొలం పోకపోతే మఱెక్కడికినేనుపోతానల్లో!" అనిముసిలమ్మకంటె ఎక్కువదీర్ఘాలుతీయసాగింది. "మెఱుపులూ మేఘాలూ చూడు" అన్నాడుఒకడు చల్లన వీపుమీదచరచి. "మెఱుపులు నారుద్రయ్యఎముకలుకావటర్రా! మేఘాలునారుద్రయ్యవొంటిచాయ కాదటర్రా నేనుసూడలేనల్లో!" అని బొబ్బలెత్తసాగింది. "సీసాలోకి ఎక్కించి పంపించేస్తాంరుద్రయ్యా" అని మాలచ్చుమమ్మను వేపబెత్తంపుచ్చుకు కొట్టాడుమఱొకడు. ఒకత్తె మాలచ్చుమమ్మకువిడిపోతూవున్న జుత్తుముడేసి "తల్లీ! యింట్లోకిరా! చల్లంగతొంగుండుండు కాస్సేపు" అని లోపలకు తీసుకొనివెళ్లింది.

ఆతరువాత కొన్నాళ్లదాకా మాలచ్చుమమ్మ మామోలుమనిషిలాగే వుంది. తొలకరించింది. పచ్చగడ్డి మొలిచింది. చెరువులునిండినయి.

తొలకరించగానే గిత్తల్ని,బండినీఅమ్మేసి మాలచ్చుమమ్మఎక్కడకోపోయింది. కాని రుద్రయ్యనుతప్ప మఱెవణ్ణీ వుంచుకోలేదనేవాడుక. మఱెవరైనాదరికొస్తే రుద్రయ్యకార్చిచ్చులా గెదరుంటాడనీదట ఏవూళ్లో ఎవరడిగినా.

"పెళ్ళిచేసుకుంటే దయ్యమై వెంటాడించకపోయ్యేవాడేమో" అని అనుకునేవారుఅంతా. అదిమాత్రం "ఇంతపేమంట్రాఇంకా నేనంటే"నని ఓమాటు గాలిని కావిలించుకున్నట్టు పైవాళ్ళకు కనబడుతూ వుండేది పెఱ్ఱిగా.

---

# భారతీయ చిత్రకళ

గ్రంథకర్త: తలిశెట్టి రామారావుగారు, బి, ఏ., బి. యల్.,

ప్రాచీనకాలమునుండి భారతదేశమున చిత్రకళ పొందుచువచ్చిన మార్పులు, అభివృద్ధి మొదలయిన విషయములు, హైందవ చిత్రలేఖనోదయము, బౌద్ధకాలమునాటి చిత్రకళ, అజంతవిధానము, బాఘువిహారములందలి చిత్రకళ, మొగలు చిత్రకళావిధానము, రాజపుత్ర చిత్రములనైఖిరి, సేటిచిత్రములు మొదలయినవానిని గూర్చిన చరిత్రాదులు వివరముగా నీ గ్రంథమున చర్చింపబడినవి. ఆయాకాలపు చిత్రవిధానమును దెలుపునట్టి త్రివర్ణ-ఏకవర్ణచిత్రములు నలువది ఇందు గలవు. చిత్రకారులు, చిత్రకళాజిజ్ఞాసువులు, చిత్ర కళాభిమానులు నగు నాంధ్రులెల్లరు తప్పక చదువవలసిన గ్రంథము.

వెల. రు. ౧-౧-౦.

మేనేజరు, ఆంధ్రగ్రంథమాల, నెం. ౭, తంబుచెట్టివీధి, మదరాసు.

---